# దయ్యాలు చెప్పిన కథలు

'కౌశ్రీ'

**మరునాటి రాత్రి** యథాప్రకారంగా వంక్తి భోజనాలు చేసి, మర్రిచెట్టు కింద మంట వేసుకుని చలి కాగుతున్నాయి దయ్యాలు. కథాశ్రవణ కుతూహలశీలియైన ఆంజనేయులు గుర్తు చేయగానే కెరటాల తాశిల్దారు కథ మొదలుపెట్టింది రవెన్యూ దయ్యం. తక్కిన దయ్యాలన్నీ అవధానంతో వింటున్నాయి.

## కెరటాల తాశిల్దారు కథ

ఒక చోట లింగమూర్తి అనే తాశిల్దారు పనిచేస్తున్నాడు. లంచం లేకుండా ఏ పనీ చేసేవాడు కాదు. ఏదో వల పన్ని తనతో సంబంధం లేనివాళ్ళను సైతం గుప్పిట్లో ఇరికించుకుని లంచం గుంజేవాడు. వర్షంలో తడవని వాళ్ళయినా ఉన్నారు గానీ, లింగమూర్తికి లంచమివ్వనివాళ్ళు లేరా తాలూకాలో.

ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరంధామయ్య కొత్తగా వచ్చాడు. నిజాయితీపరుడు. నెల రోజులు గడిచినా అతను తన దగ్గరకు రాలేదని అవకాశంకోసం ఎదురు చూస్తున్నాడు లింగమూర్తి. ఆ పాఠశాలలో పనిచేస్తున్న మరొక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని కొట్టాడు. అదే సాకుగా తీసుకుని వరంధామయ్యను పిలిపించాడు లింగమూర్తి.

"మీ స్కూల్లో ఒక కుర్రాడిని చితక బాదారట. ఆ విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడు. మిమ్మల్ని అరెస్టు చేయించి కేసు పెట్టవలసి ఉంటుంది. ఏమిటి మీ సంజాయిషీ?"

"కొట్టింది నేను కాదు."

"కానీ హెడ్మాస్టరుగా బాధ్యత మీది. కొడుకు చేసిన నేరానికి తండ్రిని పట్టుకుంటారు. అలాగే మీ అసిస్టెంట్ తప్పిదానికి మిమ్మల్ని బాధ్యులను చేస్తారు."

వరంధామయ్య మాట్లాడలేకపోయాడు. తాశిల్దారు దగ్గర జవానుగా ఉన్న బావనయ్య వరంధామయ్యను చాటుకు పిలిచి, తప్పించుకునే మార్గం చెప్పాడు. గత్యంతరం లేక వందరూపాయలు తాంబూలంలో పెట్టి బతిమాలి సమర్పించి బయట పడ్డాడు వరంధామయ్య. తిరిగి వెళ్ళుతూ తాను పిల్లలకు చెప్పిన 'తోడేలు- మేకపిల్ల' కథ గుర్తుకు రాగా, నిస్సహాయంగా నవ్వుకున్నాడు.

గవర్నమెంటు డిస్పెన్సరీలో పనిచేస్తున్న నర్సు సూర్యకాంతం లింగమూర్తి వలకు అందకుండా తప్పించుకుని తిరుగుతోంది. ఒకసారి సూర్యకాంతం ఒక డెలివరీ కేసు చేసింది. పుట్టిన బిడ్డ చనిపోయింది. వెంటనే సూర్యకాంతాన్ని పిలిపించాడు లింగమూర్తి.

ఏమిటి? పుట్టిన బిడ్డను చంపేశావట!"

"రామ రామ! నేనెందుకు చంపుతాను, సార్?"

"కావాలని కాకపోయినా నువ్వు పురుడు పోయడం వల్లనే బిడ్డ చనిపోయిందట. అలాగని వాళ్ళు కేసు పెడుతున్నారు. గవర్నమెంటు ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు ప్రైవేటు వ్యక్తుల ఇళ్ళకు వెళ్ళి వైద్యం చేయకూడదు కదా! పైగా ఆసుపత్రి డాక్టరు లేని సమయంలో ఎవరి పర్మిషన్ తీసుకుని వెళ్ళావు? ఆ శిశు మరణాన్ని హత్యగా భావించి నిన్ను జైలుకు పంపవలసి ఉంటుంది. మన చట్టాలు, శాసనాలు అలా ఉన్నాయి మరి!"

"ఇదేం అన్యాయం, సార్? ఆ తల్లి బాధ పడుతోందని వాళ్ళ మనుషులు వచ్చి గోల పెడితే వెళ్ళాను. మానవ సేవే వైద్యుల కర్తవ్యం కదా అని చేతనైన సాయం చేయబోయాను. ఆ శిశువు కడుపులోనే మరణించింది. నేను సాయం చేయకపోతే తల్లి ప్రాణానికి కూడా ముప్పు కలిగేది. డాక్టరుగారు ఊళ్ళో లేరు. రెండు రోజుల వరకు రారు. అంతవరకు ప్రమాదం ఆగుతుందా? మంచి చేయాలనుకోవటం తప్పా, సార్?"

"నీ సంకల్పం మంచిదే కావచ్చు. కానీ ఫలితమేమిటి? ఫలితాన్ని బట్టే కదా న్యాయ నిర్ణయం జరిగేది! కాదంటే పదేళ్ళు పడే జైలు శిక్ష ఆరేళ్ళకు తగ్గవచ్చు."

"అన్యాయం!అన్యాయం,సార్!"

"హాస్పటల్‌లోని మందులు, పరికరాలు పట్టుకుని వెళ్ళి వాడావట! వాటిని బయటకు తీసుకుని వెళ్ళే అధికారం నీకు లేదు. అయినా తీసుకుని వెళ్ళావు. రూల్సుకు వ్యతిరేకంగా ప్రవర్తించటం న్యాయమా? జైలు శిక్ష తప్పదు."

సూర్యకాంతం భయంతో గడగడలాడిపోయింది. భయపడవద్దని పక్కకు పిలిచి తరణోపాయం చెప్పాడు జవాను బావనయ్య. లింగమూర్తి కాళ్ళమీద పడి వందరూపాయలు తీసుకోమంది. బతిమలాడింది. కంట తడి పెట్టుకుని వేడుకుంది. జాలితో కరిగిపోయిన లింగమూర్తి పచ్చ కాగితాన్ని తీసుకుని సూర్యకాంతాన్ని పొమ్మన్నాడు.

అలాగే ప్రతివారిని ఏదోవిధంగా రప్పించి లంచం రాబట్టే వాడు తాశిల్దారు. విసిగి వేసారిన తాలూకా ప్రజలు లింగమూర్తిమీద ఫిర్యాదులు చేయసాగారు. ఫిర్యాదులు మరీ ఎక్కువ కావటంతో ఆకస్మిక విచారణకు వెళ్ళి, మునిసిపల్ ట్రావెలర్స్ బంగళాలో దిగి లింగమూర్తికోసం కబురు చేశాడు జిల్లా కలెక్టరు.

బంగళాలో గబ్బిలాలు వేలాడుతున్నాయి. కుర్చీలలో నల్లులు మానవ రక్తపానం కోసం ఆరాట పడుతున్నాయి. బంగళా ఆవరణలో బర్రెలు పచ్చగడ్డి మేస్తున్నాయి. ఆ వాతావరణానికి చిరాకుపడుతూ, లింగమూర్తికి బదులు బావనయ్య ఎదురుపడటంతో మండిపడుతూ అన్నాడు కలెక్టరు-

"మీ తాశిల్దారెక్కడ?"

"చిత్తం! క్యాంపు వెళ్ళారు, సార్!"

"రవెన్యూ ఇనస్పెక్టరు?"

"ఆయన మరో చోటకు వెళ్ళి ఉంటారు, సార్!"

"లింగమూర్తి ఏ ఊరు వెళ్ళాడు?"

"చిత్తం! తమరు వస్తారని తెలియదు, సార్. పెదపాడు గ్రామంలో ప్రజలు కాలవ నీరు పంపకం దగ్గర తగాదా పడి కొట్టుకోటానికి సిద్ధంగా ఉన్నారట. కందివాడ గ్రామంలో రెండు కులాల వాళ్ళు పోట్లాటకు తలపడి కత్తులు, కటార్లు నూరుతున్నారట. తాశిల్దారుగారు అక్కడకు వెళ్ళారో, ఇక్కడకు వెళ్ళారో తెలియదు."

"ఆ విషయాలు నీకెవరు చెప్పారు?"

"ఒకాయన అయ్యగారితో చెబుతుంటే విన్నాను, సార్."

"ఎవరాయన?"

"తెలియదు, సార్!"

బావనయ్య చెప్పిన గ్రామాలు దక్షిణాన ఒకటి; ఉత్తరాన ఒకటి ఉన్నాయి. తాశిల్దారుకోసం ఎక్కడకు కబురు చేయాలో తేలక చిరాకు పడుతూ అన్నాడు కలెక్టరు-

"తాశిల్దారు లంచాలు బాగా తీసుకుంటున్నాడా?"

"మా అయ్యగారు అటువంటి మనిషి కాదు, సార్. అగ్నిహోత్రం లాంటివారు. పరుల సొమ్మును కన్నెత్తి చూడరు. అనుకున్న వాళ్ళది పాపం, సార్!"

"ప్రజలే అబద్ధమాడుతున్నారా?"

"చిత్తం! మన ప్రజల సంగతి తమకు

> 'ఇవి కేవలం హాస్యంకోసం కల్పించబడిన కథలు. మీ స్వరూప స్వభావాలు కానీ, పేరు, ఉద్యోగంకానీ, డిపార్టుమెంటుకానీ ఇందులో కనబడితే భుజాలు తడుముకోకండి. అవన్నీ మీ పక్కవాళ్ళవిగా భావించి చదువుకోండి-నవ్వుకోండి! అంతే!
>
> \- రచయిత.

తెలియదు, సార్!"

"వాట్? నా ప్రజల గురించి నాకు తెలియదా?"


"చిత్తం! తమరు ముక్కుకు సూటిగా పోతారు. తమరు మంచివారు, నిజాయితీపరులు కాబట్టి ప్రజలందరూ అటువంటివాళ్ళే అనుకుంటున్నారు. ప్రజలు చేసే అక్రమాలు తమకు తెలియవు, సార్."

"ఏం చేస్తున్నారు?"

"చిత్తం. గవర్నమెంటు పోరంబోకుల్ని అక్రమించుకుంటున్నారు. ఏళ్ళ తరబడి భూమి శిస్తులను బకాయి పెడుతున్నారు. బియ్యం, సిమెంటు దొంగ రవాణా చేస్తున్నారు. అటువంటి వాళ్ళ ఆటలు సాగనివ్వటం లేదు మన తాశిల్దారుగారు. అందుకే రాత్రింపగళ్ళు తిరుగుతుంటారు. తమ దారికి అడ్డుపడుతున్నారని తాశిల్దారు మీద ప్రజలు కక్షతో ఉన్నారు, సార్."

"అటువంటి ప్రజలు ఈ ఒక్క తాలూకాలోనే ఉన్నారా?"

"నా అంచనా ప్రకారం దేశమంతటా ఇలాగే ఉన్నారనుకుంటున్నాను, సార్. అయినా జిల్లా అధికారులు-తమకు తెలియాలి గాని నా కెలా తెలుస్తుంది, సార్? తమ తాబేదార్లు చెడ్డవాళ్ళంటే తమ ఏలుబడికే మచ్చకదా, సార్!"



"ఊ! రేపు రమ్మని చెప్పు లింగమూర్తికి."

"చిత్తం! చిత్తం! అలాగే, సార్."

ఎవరికీ తల వంచనివారు సైతం బార్బరు ముందు తల వంచుతారు. ఎవరి మాటా వినని వాళ్ళు కూడా ఫొటోగ్రాఫరు మాట వింటారు. అలాగే ఎవరికీ భయపడని ఆఫీసరు కూడా ఇంట్లో పనిచేసే ఆఫీసు జవానుకు భయపడతాడు.

కలెక్టరు వెళ్ళిపోయాడు. ఆయన మనసు బావనయ్య చెప్పినదాన్ని అంగీకరించటం లేదు. నిప్పు లేనిదే పొగ రాదు, పీడించకపోతే పిటిషన్లు రావు అనుకుని ప్రజల ఫిర్యాదులను బుట్టదాఖలా చేయలేక లింగమూర్తిని బదిలీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ మరునాడు కలెక్టరు దగ్గరకు వెళ్ళి అతి వినయంగా నమస్కరించాడు లింగమూర్తి.

"నిన్న ఎక్కడికి వెళ్ళావు?"

"కందివాడ గ్రామం, సార్!"

"ఎందుకు?"

"అక్కడ రెండు కులాల మధ్య తగాదాలు చెలరేగుతున్నాయి, సార్. మనం అశ్రద్ధ చేస్తే

వందలకొలదీ ప్రాణాలు పోతాయి. వాళ్ళకు రాజీ చేద్దామని వెళ్ళాను, సార్."

"చేశావా రాజీ?"

"తమ దయవల్ల రాజీ కుదిరింది, సార్."

"అక్కడ తగాదాలు ఉన్నట్టు వినలేదే!"

"ఇంకా బయటపడలేదు, సార్. లోలోన రగులుతున్నాయి కక్షలు. ఏ క్షణాన బయట పడతాయో, ఎన్ని ప్రాణాలు పోతాయో ఊహించలేం, సార్. అటువంటి ప్రమాదం జరగకుండా ముందే జాగ్రత్తపడి రాజీ కుదిర్చాను, సార్."

"నిన్న ఎమ్మెల్లేగారు వచ్చారు. చెప్పలేదే ఆ సంగతి?"

"వారికి తెలియదు, సార్."

"నీ కొక్కడికే ఎలా తెలిసింది?"

"నా విషయం నేను చెప్పుకో కూడదు, సార్. నిజం చెప్పినా అతిశయోక్తిలా ఉంటుంది. తలలోని నాలుక లాంటి మనుషులు నాకు అన్ని గ్రామాలలోను ఉన్నారు. వాళ్ళద్వారా గ్రామాల్లోని రహస్యాలన్నీ ముందుగా తెలుస్తాయి, సార్."

"ఊ! ప్రతిచోటా ఏజెంట్లను పెట్టావన్నమాట?"

"ఏజెంట్లా? ఎందుకు, సార్?"

"ఎందుకా? లంచాలు వసూలు చేసి పెట్టటానికి!"

"రామ రామ! శివశివ! ఎటువంటి మాట వినవలసి వచ్చింది! తమ పరిపాలనలో లంచగొండులా? అందులోనూ నేనా? హరి హరి! ఎవరో కిట్టనివాళ్ళు చెప్పి ఉంటారు తమకు."

"షటప్! నీ సంగతి ఎమ్మెల్లే గారు చెప్పారు."

"ఆయనా? తాలూకాకు లక్ష ఇమ్మంటున్నాడు."

"అనవసరంగా మాట్లాడకు. నీమీద చాలా ఎలిగేషన్స్ వచ్చాయి. నువ్వేమీ చేయకపోతే వాళ్ళందరికీ ఎందుకు నీ మీద కక్ష? నిన్ను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను."

కోపంతో విసురుగా కుర్చీలో నుంచి లేచి వెళ్ళబోయాడు కలెక్టరు. బదిలీ అనగానే భయపడిన లింగమూర్తి తడబడుతూ ఆత్రంగా అడిగాడు-

"ట్రాన్స్‌ఫరా? ఎక్కడికి, సార్?"

"ఎక్కడికా? ఎక్కడికా? ప్రజలెవరూలేని చోటికి. నీకు పనిలేని చోటికి. లంచాలు దొరకని చోటికి. సముద్రం ఒడ్డుకి!"

"సముద్రం ఒడ్డుకా? అక్కడ పనేముంది, సార్?"

"ఏం లేదు. కెరటాలు లెక్కపెట్టు."

విసురుగా లోపలకు వెళ్ళిపోయాడు కలెక్టరు. కోపం, చిరాకు, ఆవేశం పెరిగి లింగమూర్తిని ఎక్కడికి బదిలీ చేయాలా అన్న ఆలోచనతో సతమతమవుతున్న సమయంలో లింగమూర్తి ప్రశ్నలు మరీ రెచ్చగొట్టడం వల్ల కసిగా అలా అనేశాడు. కలెక్టరు సత్యసంధుడని పేరు పొందాడు. ఆడిన మాట తప్పడు. ఏదో ఆవేశంలో అన్నాంలే అని పునరాలోచన చేయకుండా లింగమూర్తిని సముద్రం ఒడ్డున కూర్చుని కెరటాలు లెక్కపెట్టవలసిందని ఆదేశిస్తూ బదిలీ ఉత్తర్వులు జారీ చేశాడు.

కథ చెబుతున్న రవెన్యూ దయ్యాన్ని మధ్యలో ఆపి, అభ్యంతరం లేవదీసినట్టుగా ఎగతాళిగా నవ్వుతూ అంది ఆడిట్ డిపార్టుమెంటు దయ్యం-

"తాశిల్దారును బదిలీ చేసే అధికారం కలెక్టరుకు లేదు."

"ఇప్పుడుకాదు. ఒకప్పటి మాట. మనకు స్వతంత్రం వచ్చిన తొలి రోజులవి. అప్పట్లో కలెక్టర్లందరు తెల్లదొరలే ఉండేవారు. అక్కడక్కడ నల్ల దొరలున్నా తెల్లదొరలతో సమానంగానే అధికారాలుండేవి. కలెక్టరు సర్వాధికారి."




"అయినా బదిలీ శిక్ష కాదుగా. నేరం చేసిన వాడిని శిక్షించాలి గానీ కేవలం బదిలీ చేయట మేమిటి? ట్రాన్స్‌ఫర్ ఈజ్ నాట్ పనిష్‌మెంట్ అని చెబుతున్నాయి రూల్సు! ఆ సంగతి కలెక్టరుకు తెలియదా?"

"దేశమంతా తిరిగి చూడకుండా తెల్లవాడు రాసిన రూల్సు అవి. కోనసీమ కొబ్బరితోటల్లోనో, కృష్ణాజిల్లా చల్లని సీమల్లోనో ఉండే వాడిని తీసుకు వెళ్ళి పాడేరు కొండమీద పడేస్తే శిక్ష గాక మరేమిటి? పనిష్‌మెంటుగానే శంకరగిరి మన్యాలు పట్టించేవారు."

"సముద్రపు టొడ్డున తాశిల్దారు పోస్టు మంజూరై ఖాళీగా ఉందా! పని లేక పోతే పోస్టు ఎలా వచ్చింది? పని లేని చోట పోస్టు శాంక్షను చేయటం, పని చేయించుకోకుండా జీతభత్యా లివ్వటం ఆడిట్ అభ్యంతరం."

"ప్రజాక్షేమం ఆలోచించి తాశిల్దారును బదిలీ చేశారు. రూల్సు ప్రజలకోసం కానీ, ప్రజలు రూల్సుకోసం కాదు. ఇప్పటిలా అప్పుడు మండలాలు లేవు. ప్రజా నాయకులది పైచేయి కాదు. జిల్లాలో కలెక్టరే సర్వాధికారి అని చెప్పాను కదా!"

"అధికార దుర్వినియోగం పెద్ద అబ్జక్షన్."

"ఇదిగో, అడిట్ బాబూ! కథ మధ్యలో నీ పిడకల వేట ఏమిటయ్యా? నీ అభ్యంతరాలు తర్వాత చూద్దాంలే! కథ విను! రవెన్యూ బాబూ! నువ్వు కథ చెప్పు" అంది ఆంజనేయులు దయ్యం. అందరి ముఖాల్లోనూ అదే భావం కనబడుతోంది. వాళ్ళ ముఖాలు చూచి మళ్ళీ కథ చెప్పసాగింది రవెన్యూ డిపార్టుమెంటు దయ్యం-

కలెక్టరు ఆర్డరు ప్రకారం కెరటాలు లెక్కపెట్టటానికి కాగితాల కట్ట పట్టుకుని సముద్రపు టొడ్డుకు వెళ్ళాడు తాశిల్దారు లింగమూర్తి.

ఉవ్వెత్తుగా లేచి విరిగి పడుతున్నాయి సముద్ర తరంగాలు. పరుగు పందెంలో పాల్గొంటున్న యువకుల్లాగ పరుగులు తీస్తున్నాయి. తీరాన్ని తాకుతున్నాయి. తిరిగి వెనక్కి, పరుగెడుతున్నాయి. కెరటాల అంచుల మీద సూర్య కిరణాలు పడి తళతళ లాడుతున్నాయి.

తీరంలోని ఇసుక తిన్నెల మీద ఏపుగా పెరిగిన సర్వీ చెట్లు ఈల పాట పాడుతున్నాయి. దానికి వంతపాటలా వినబడుతోంది సముద్రపు ఘోష. సర్వీ తోటలో చల్లని నీడను కూర్చుంటే హాయిగొల్పుతోంది సాగర సమీరం. సముద్రంలో చేపలు వేటాడుతున్న జాలరుల పడవలు, డింగీలు కెరటాల మీద ఉయ్యాల లూగుతున్నాయి.

కొంత సేపు సరదాగానే ఉంది. కానీ రోజంతా అదే చూస్తూ కూర్చోవాలంటే విసుగనిపించింది లింగమూర్తికి. అవే కెరటాలు. అవే పరుగులు. అవే నురుగులు. అదే ఘోష. అదే గాలి! ఎంత సేపని చూస్తాడు? పైగా పై సంపాదనకు దారి కనపడదాయె. దానితో మరీ విసుగెత్తిపోయాడు. సాయంకాల మయింది.

చేపల వేట చాలించి గట్టుకు వచ్చారు జాలరులు. పడవలను కట్టుగొయ్యలకు కట్టారు. పట్టుకున్న చేపలను గట్టుమీదకు చేరవేస్తున్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు లింగమూర్తి. అతని మనసులో ఒక మెరుపు మెరిసింది. మేధస్సు వికసించింది.

"రోజు కేమాత్రం సంపాదిస్తున్నా రయ్యా?"

"తల కో పదీ దొరుకుతాయి, బాబయ్యా."

"అయ్యో, పాపం! మరి రేపటినుంచి ఎలా?"

"ఏంటి, బాబయ్యా? ఏమయింది?"

"రోజుకు పది రూపాయలు సంపాదించుకుంటూ మీ పెళ్ళాం బిడ్డలతో హాయిగా కాలం గడుపుతున్నారు గదా! రేపటి నుంచి

మీరు సముద్రం మీద తిరిగి వేటాడటానికి వీలులేదే! ఎలా బతుకుతారా అని బాధగా ఉంది."

"అయ్య బాబో! అదేంటి, బాబయ్యా?"

"నేను తాశిల్దారుని. ఈ సముద్రంలో కెరటా లెన్ని ఉన్నాయో లెక్కపెట్టమని కలెక్టరు గారు నన్నిక్కడకు పంపించారు. కెరటాల లెక్కలు వేయటానికే ఈ కాగితాలు. మీరు పడవలు వేసుకుని సముద్రం మీద తిరుగుతుంటే, పడవల వెనుక నున్న కెరటాలు కనిపించటం లేదు. కొన్ని కెరటాలు లెక్కల్లో చేరకుండా తప్పించుకునిపోతున్నాయి. వాటిని విడిచి పెడితే లెక్క తప్పుతుంది. తప్పుడు లెక్కలు చెబితే కలెక్టరు మిమ్మల్ని జైలుకు పంపుతారు. తప్పుడు లెక్కలకు కారణం మీరేకదా మరి!"

వందమందివరకు ఉన్న జాలరులు భయంతో బిగునుకుపోయారు. నోట మాట రావటం లేదు. భవిష్యత్తు గాఢాంధకారంలా ఉంది. అందులో ఒక పెద్ద వాడు మెల్లగా తేరుకుని చేతులు కట్టుకుని అన్నాడు-

"మరి మా బతుకెలాగ, బాబయ్యా?"

"నాకు బాధగానే ఉంది. నన్నేం చేయమంటారు?"

"తఁవరే మా కేదో దారి చూపించాలి. ఏటాడకపోతే బతుకు తెరువు లేదు. మరో పని చేతకాదు. పెళ్ళాం పిల్లలతో షుడి సావాల! తఁవరే దయ చూపించాలి!"

జాలరు లందరూ చేతులెత్తి మొక్కుతూ బిక్కుబిక్కుమంటున్నారు. దైన్యం అమాయకత్వం వాళ్ళ కళ్ళలో గూడు కట్టుకున్నాయి. లింగమూర్తి బోలెడంత సానుభూతితో జాలి పడుతూ అన్నాడు:

'దమీ గోడు వింటుంటే కడుపు సముద్రమై పోతోందయ్యా. మనసు కరిగిపోతోంది. కానీ కలెక్టరుగారి ఆర్డరు కదా! కాదనటానికి వీల్లేదు. నా కెరటాల లెక్క తప్పకూడదు."

"చిత్తం! తమరే దారి చూపించాలి."

"నాకు తెలి ిసినంతవరకు ఒక్కటే దారి."

"సెలవీయండి, బాబయ్యా."

"సరే! నా ఏడుపేదో నేనేడుస్తాను. మా లెక్కల సంగతి మీకు తెలియదు కదా! చివరి రోజున మోటారు లాంచీ తెచ్చి సముద్రంలోకి వెళ్ళి లెక్కల్లో చేరకుండా తప్పిపోయిన కెరటాలను పట్టుకుని జమ చేసుకుంటాను."

"మంచిమాట సెలవిచ్చారు, బాబయ్యా."

"కానీ లాంచికి వేలమీద ఖర్చవుతుందే."

"అదేదో మేమే ఇచ్చుకుంటాం, దొరా!"

"ఛ! ఛ! పేదవాళ్ళు- మీరేం ఇస్తారు లేవయ్యా!"

"అలా అనకండి, బాబయ్యా. మాకో దారి చూపించారు. మా కింత అన్నం పెట్టారు. అదే పదివేలు మాకు. అంత ఖర్చు తమ రెక్కడ పెట్టుకుంటారు, బాబయ్యా! మామాట కాదనకండి. ఒక్కసారే ఇమ్మంటే మేమైనా ఇవ్వలేం. రోజూ తలకొక రూపాయి ఇస్తాం. వందమంది దాకా ఉన్నాం కదా! మాకు ఆకలి, చావులు తప్పించారు. చచ్చి తమ కడుపున పుడతాం. కాదనకండి, బాబయ్యా."

పాదాలమీద పడి బతిమలాడారు జాలరులు. జాలిపడి అంగీకరించాడు లింగమూర్తి. ఒప్పందం ప్రకారం రోజూ సాయంకాలం వచ్చి డబ్బు వసూలు చేసుకుని వెళ్ళిపోతున్నాడు. రోజంతా హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. సుమారు నెల రోజులు గడిచాయి.

ఆ సంగతి కలెక్టరుకు తెలి ిసింది. ఒళ్ళు మండింది. సముద్ర కెరటాల లెక్క ఎలా ఉందో చూడాలని లింగమూర్తిని పిలిపించాడు. తువాలుతో కట్టిన మూట పట్టుకుని కలెక్టరు దర్శనానికి వెళ్ళాడు తాశిల్దారు లింగమూర్తి.

"కెరటాల లెక్క పూర్తయిందా?"

"అయింది, సార్! సరిగా నిన్న సాయంకాలానికే పూర్తయింది. ఈ రోజున నేనే తమ దర్శనానికి రావాలని బయలుదేరుతున్నాను. ఇంతలో తమ కబు రందింది."

"ఊఁ! ఎన్ని కెరటాలున్నాయి సముద్రంలో?"

"అంకెల్లో చెప్పటం సాధ్యం కాదు, సార్! లక్షలు, కోట్లు, అక్షౌహిణీలు అర్బుదాలు దాటిపోయాయి. ఒకటి పక్కన వేయి సున్నలు పెట్టినా చాలవు, సార్. అందుకే అంకెలు మానే ిసి ఈ పద్ధతిని లెక్క పెట్టాను."

"ఏ పద్ధతి?"

ఆశ్చర్యంగా అడిగాడు కలెక్టరు. లింగమూర్తి తాను తెచ్చిన మూట విప్పాడు. అందులో సుమారు నాలుగు శేర్లు ఉంది—సముద్రపు ఒడ్డున దొరికే గంద్ర ఇసుక!

"సార్! చదవటానికి వీలులేనంత పొడవుగా పెరిగిపోయాయి ఒకటి తరువాత సున్నలు. అంకెలు మానే ిసి ఒకో కెరటానికి ఒకో ఇసుక రేణువును వేశాను. ఈ మూటలో ఎన్ని ఇసుక రేణువు లున్నాయో కరెక్ట్‌గా సముద్రంలో అన్ని కెరటా లున్నాయి, సార్. తమరు తణిఖీ చేయాలనుకుంటే వెంటనే చేయాలి, సార్!"

"చేయకపోతే ఏమవుతుంది?"


"ఇతర సముద్రాలలోని కెరటాలు ఇక్కడకు రావటమో, ఇక్కడి కెరటాలు మరో చోటకు పోవటమో జరగవచ్చు. అలా జరిగితే లెక్క తప్పుతుంది. అందుకు బాధ్యత నాది కాదు. కలెక్టరు దొరవారు మన్నించి ముందా ఇసుకను లెక్కపెట్టించాలి. తర్వాత దొరవారే స్వయంగా కెరటాలు లెక్కపెట్టి లెక్కలు సరి చూసుకోవచ్చు."

లింగమూర్తి తెలివితేటలకు నివ్వెరపోయిన కలెక్టరు మాట్లాడలేకపోయాడు. లింగమూర్తిని ఇసుకలోనుంచి తైలం తీయగల సమర్థుడని మెచ్చుకోవాలో, ఏమాత్రం దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రజలను పీడించే రాక్షసుడని శిక్షించాలో అర్థం కాలేదాయనకు. జరిగినదంతా విపులంగా ప్రభుత్వానికి తెలియజేశాడు.

తాశిల్దారు లింగమూర్తిమీద కొత్తఫైలు ప్రారంభమయింది. లింగమూర్తి కథ సెక్రటేరియెట్‌లో సంచలనం సృష్టించింది. ఏ నోట విన్నా అతని మాటే! ఎక్కడ విన్నా అతని మాటే! క్రమంగా పేరు మరుగున పడిపోయి 'కెరటాల తాశిల్దారు'గా ప్రఖ్యాతి పొందాడు లింగమూర్తి.

అటువంటివాడు సచివాలయంలో ఉండాలన్నారు పెద్దలు. తమకు పర్సనల్ సెక్రటరీగా కావాలన్నారు కొందరు మంత్రులు. వెంటనే స్పెషల్ ప్రమోషన్ ఇచ్చి సచివాలయానికి బదిలీ చేశారు లింగమూర్తిని. అతని దగ్గర ట్రెయినింగు పొందాలని ఉవ్విళ్ళూరుతున్నారు యువతరం ఉద్యోగులు.

కథ చెప్పటం ముగించింది రెవెన్యూ డిపార్టుమెంటు దయ్యం. అంతవరకు కథ వింటున్న ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంటు దయ్యం ఎగతాళిగా అంది—




"గంటల గరటయ్య, కెరటాల తాశిల్దారు తమ సంపాదనే చూచుకున్నారు తప్ప తమ మీద ఫిర్యాదులు చే ిసిన శత్రువులను దెబ్బ తీయలేదు. మా బ్రేక్ ఇన స్పెక్టర్ నూకరాజు తన లాభం తాను పొందుతూ, ఫిర్యాదు చే ిసిన శత్రువును దెబ్బతీశాడు. మా నూకరాజు గొప్పవాడు కదా!"

"ఎవ రా నూకరాజు? ఏ మా కథ?"

కుతూహలంగా అడిగాడు ఆంజనేయులు. ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంటు దయ్యం బ్రేక్ ఇన స్పెక్టర్ నూకరాజు కథ మొదలు పెట్టింది. అంతలో కోడి కూ ిసింది. కోడి కూత వినగానే దయ్యాలన్నీ గాలిలో కల ిసిపోయినట్టుగా మాయమయ్యాయి. చలిమంట వెలుగుతూనే ఉంది.

[బ్రేక్ఇన స్పెక్టర్ నూకరాజు కథ—వచ్చే వారం]